క్లుప్తంగా

మున్సిపల్ దుకాణాల అద్దె 33 శాతం పెంపు


అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్: మున్సిపల్ పరిధిలోని పాతబస్టాండ్ దర్గమ్మగుడి ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ అద్దెలను 33 శాతం పెంచుతూ ఇప్పుడు ఉన్న యజమానులకు తిరిగి కేటాయించినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, రెవెన్యూ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. 25 ఏళ్లు పూర్తయిన మున్సిపల్ దుకాణాలను ఓపెన్‌గా వేలం వేయడానికి తమకు అధికారం ఉందని యజమానులకు గుర్తు చేయాలని అధికారులను కోరారు. దుకాణాలను కేటాయించి 20 ఏళ్లు అయినందు వల్ల మరో 5 ఏళ్ల పాటు 33 శాతం అద్దె పెంచుతూ తీర్మాణించామన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న వెంకటసుబ్బారెడ్డి

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి శనివారం 250 రకాల పుస్తకాలను గ్రంథాలయ అధికారి మనోహర్‌కు అందజేశారు. లైబ్రరీకి చాలా మంది పాఠకులు వస్తుంటారని, వారందరికీ ఉపయోపడేలా విలువైన పుస్తకాలను ట్రస్ట్ తరఫున అందజేశామన్నారు.

నీటి పన్ను చెల్లించకుంటే సరఫరా నిలిపివేస్తాం


నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

డోన్: మున్సిపల్ పరిధిలో ఏళ్ల తరబడి మంచినీటి పన్ను చెల్లించని యజమానుల ఇళ్లకు కొళాయి కనెక్షన్ కట్ చేసి నీటి సరఫరా నిలిపివేస్తామని మున్సిపల్, రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి హెచ్చరించారు. స్థానిక తారకరామనగర్ పరిధిలో రెండేళ్లకుపైగా మంచినీటి పన్నులు చెల్లించని ఇళ్లకు శనివారం నోటీసులు జారీచేశారు. రెవెన్యూ అధికారి మోహన్, సిబ్బంది గౌస్, నాగరాజు పాల్గొన్నారు.

అప్కాస్‌లో చేర్చాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల: నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి కమిషనర్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తూ మరణించిన పద్మావతి, మేరమ్మ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు బాల తిమ్మయ్య, శేఖర్, నాగ మద్దమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాలల హక్కులను హరించే కుట్ర


మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దేవరత్నం

కోవెలకుంట్ల: రాష్ట్రంలో మాలల హక్కులను హరించి వేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అవుల దేవరత్నం ఆరోపించారు. శనివారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు.

కూటమి ప్రభుత్వంలో మాలలకు రక్షణ కరువైందని, శాంతియుత నిరసన చేసినా రాత్రి వేళల్లో పోలీస్ సిబ్బందిని పంపించి సంకెళ్లు వేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాణాలతో ‘సెల్’గాటం

- పెరుగుతున్న సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు
- రెప్పపాటులో రోడ్డు ప్రమాదాలు
- కేసులు నమోదు చేస్తున్న మారని తీరు

డోన్ రూరల్: డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడడం ద్విచక్ర వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. రింగ్ అయిన ఫోన్ లిఫ్ట్ చేసి హలో అనే లోపే బైక్ నియంత్రణ కోల్పోయి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రెప్పపాటు వ్యవధినే ప్రమాదాల బారినపడి విగతజీవులుగా మారుతున్నారు. తమ కుటుంబాలకు తీరని దుఖాన్ని మిగుల్చుతున్నారు..

డేంజర్..యమ డేంజర్

ద్విచక్ర వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడడం వల్ల డ్రైవింగ్ దృష్టి మరలుతుంది. సెల్‌ఫోన్‌లో మాట్లాతున్నంత సేపు సంభాషణ మీదే ధ్యాస ఉంటుంది. దీంతో వెనుక, ముందు వచ్చే ఇతర వాహనాలను గమనించడం చాలా తక్కువ. ఈ క్రమంలో ఎదురుగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నా.. ఏదైనా వాహనం వచ్చినా నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. అదుపు తప్పి మరో వాహనాన్ని ఢీకొట్టడం, కింద పడిపోవడం లేదా రోడ్ సైడ్‌కు దూసుకుపోవడం జరుగుతుంది. ఇదంతా ఒక ఎత్తయితే.. ఒకచేతిలో సెల్‌ఫోన్ మరో చేతిలో ద్విచక్ర వాహనం హ్యాండిల్ లేదా కారు స్టీరింగ్ పట్టుకుని డ్రైవింగ్ చేస్తున్న వారిని గమనిస్తుంటాం. అకస్మికంగా ఫోన్ కిందపడిపోతుంటే పట్టుకునే ప్రయత్నంలో వాహనం అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు అనేకం. కొన్ని సందర్భాల్లో మొబైల్ మోగగానే ముందు వెనుక చూసుకోరు. ఒక్కసారిగా వాహనం ఆపి హలో...హలో అంటుంటారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు వారిని ఢీకొంటున్నాయి. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయినా వాహనదారుల్లో మార్పురావడంలేదు. డోన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో పోలీసులు తనిఖీలు చేస్తూ ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.



హెల్మెట్ వాడకుంటే ప్రాణాలకే ముప్పు

గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకం చాలా వరకు తగ్గించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తలకు హెల్మెట్ లేకపోవడం వల్ల ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే ప్రాణాలను కోల్పోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, రవాణా శాఖ అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుని విలువైన ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తనిఖీలు చేస్తున్నాం



సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతి రోజు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. హెల్‌మెట్ లేని కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో ప్రాణాలు పోతున్నాయన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలి.
–రాకేష్, డోన్ రూరల్ సీఐ

కఠిన చర్యలు తీసుకుంటాం



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలా పట్టుబడితే మొదటిసారి రూ.1,500, రెండోసారి అదే వాహనంపై ఫోన్ మాట్లాడుతూ పట్టుబడితే రూ.10 వేల వరకు జరిమానా ఉంటుంది. వాహనంతో రోడ్డుపైకి వచ్చినప్పుడు మనకోసం ఓ కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తుపెట్టుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి. –క్రాంతికుమార్, ఆర్‌టీఓ, డోన్

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. శిబిరంలో ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, గుండె, కంటి, చర్మ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉచితంగా మందులు అందజేస్తారని, ఆ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు రిమాండ్

అవుకు: మండల పరిధిలోని కాశీపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. గతంలో పనిచేసిన సుంకేసుల గ్రామ పంచాయతీ సెక్రటరీ సంతకాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ బాల రామగోవిందు ఫోర్జరీ చేశారని ప్రస్తుత సెక్రటరీ వెంకటేశ్వర్లు గత ఏడాది డిసెంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా రాజకీయ కక్ష్య సాధింపులో భాగంగానే గత ఏడాది డిసెంబర్‌లో కేసు నమోదు చేయించి, సుమారు నాలుగు నెలల తరువాత రిమాండ్‌కు తరలించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

25న కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవం

డోన్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో 11వ ఆరాధన మహోత్సవాలను ఈనెల 25వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో జగదర్తి, ఉడుములపాడు సర్పంచ్‌లు రాజేశ్వరరెడ్డి, రాధమ్మ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.5016 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని ఉడుములపాడు కాశీరెడ్డినాయన ఆలయం సమీపంలో శనివారం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రూరల్ సీఐ రాకేష్ వివరాల మేరకు.. శనివారం ఉదయం ఓ వ్యక్తి రక్తగాయాలతో పడి ఉండడం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాలీసెట్‌కు ఉచిత కోచింగ్

బనగానపల్లె రూరల్: స్థానిక వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్‌కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఏప్రిల్ 3వ తేదీ నుంచి 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో పాలీసెట్ పరీక్ష కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

పోటాపోటీగా వేలం పాట

- గతేడాది కంటే రూ. 8.95 లక్షల ఆదాయం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో 2025–26 సంవత్సరానికి సంబంధించి వివిధ పనుల నిర్వహణకు శనివారం నిర్వహించిన వేలంపాట పోటాపోటీగా సాగింది. సర్పంచ్ మెట్ల సరళ ఆధ్వర్యంలో వేలం పాటు జరిగింది. సంతమార్కెట్ నిర్వహణ పనులను పట్టణానికి చెందిన రాజశేఖర్ రూ. 22.96 లక్షలకు దక్కించుకున్నాడు.

దినమార్కెట్ పనులను కె. వెంకటేశ్వర్లు రూ.12.10 లక్షలకు, బస్టాండ్ పనులను రాజశేఖర్ రూ. 10.10 లక్షలకు, కమేళాను ఫజుల్ రూ. 8 వేలకు వేలంలో కైవసం చేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ పనులకు రూ. 36.29 లక్షలకు పాడగా ఈ ఏడాది వేలంపాటదారుల మధ్య పోటీ పెరిగి రూ. 45.24 లక్షల వరకు పలికింది. గ్రామ పంచాయతీకి గత ఏడాది కంటే రూ. 8.95 లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

‘తమ్ముళ్ల’ మధ్య పదవుల చిచ్చు

డోన్: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు తీవ్రరూపం దాల్చింది. మద్యం దుకాణాల సిండికేట్ వ్యవహారంలో ఎమ్మెల్యే వర్గీయులతో ధర్మవరం సుబ్బారెడ్డి వర్గీయులు తీవ్రంగా విబేధించడం కారణంగా బెల్టుషాపుల వ్యవహారం బెడిసికొట్టింది. దీంతో తారకరామనగర్‌లో తమ వర్గీయుల మద్యం దుకాణానికి సమీపంలో ఉన్న సుబ్బారెడ్డి అనుచరుల మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని కోట్ల వర్గం ఎక్సైజ్ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య వచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. దీనికితోడు వాటర్‌షెడ్ వ్యవహారంలో కోట్ల వర్గీయులు పెత్తనం చెలాయిస్తూ సొంత పార్టీకి చెందిన సర్పంచ్‌ను అవమానిస్తున్నారని సుబ్బారెడ్డి వర్గీయులు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో సుబ్బారెడ్డి వర్గీయుడైన యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డిపై అధికారులను పురమాయించి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే కేసు నమోదు చేయించారని సొంత పార్టీ నేతలే ఆరోపణలు గుప్పిస్తున్నారు.

మార్కెట్‌యార్డు చైర్మన్ పదవికి రిజర్వేషన్ చిచ్చు

ఎన్నికల ముందు టీడీపీలో చేరిన ప్యాపిలి రాజా నారాయణమూర్తి కుటుంబం కోసం మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని ఓసీ మహిళకు కేటాయించేలా ఎమ్మెల్యే కోట్ల వర్గం ప్రయత్నిస్తున్న విషయాన్ని పసిగట్టి సుబ్బారెడ్డి వర్గం మంత్రి బీసీ అండదండలతో డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించేలా పావులు కదిపి పైచేయి సాధించారు. ఎమ్మెల్యే తన వర్గానికి చెందిన నారాయణమూర్తిని కాదని బీసీ వర్గానికి చెందిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామక్రిష్ణ భార్య పేరును మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి కోసం అధిష్టానానికి సూచించగా, దీనిని కూడా ధర్మవరం సుబ్బారెడ్డి, నాగేశ్వరరావ్ యాదవ్ వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ


ప్యాపిలిలో శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు

కోవెలకుంట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కార్యకర్తలకు స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ‘పోషణ్‌భీ పడాయి’ అనే కార్యక్రమంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, జమీల శిక్షణ ఇచ్చారు. సున్న నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆదర్శిల అనే అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు.

బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

ప్యాపిలి: అంగన్‌వాడీ వర్కర్లు బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూపర్‌వైజర్లు దేవకృపమ్మ, శకుంతల, రాధమ్మ, అరుణకుమారి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ‘పోషణ్ భీ..పడాయిభీ’ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు తమ కేంద్రాల్లో ఉన్న పిల్లలకు పోషకాహారాన్ని ఇస్తూ ఆటపాటలతో కూడిన విద్య అందించాలన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్‌లు షురూ..!

కోవెలకుంట్ల: ఐపీఎల్ 18వ సీజన్ శనివారం నుంచి ప్రారంభమైంది. 73 మ్యాచ్‌లతో స్టేడియాలు హోరెత్తనున్నాయి. ఎంతో ఉత్కంఠభరితంగా సాగే టీ–20 మ్యాచ్‌లు బెట్టింగ్‌రాయుళ్లకు కాసుల వర్షం కురిపించనున్నాయి. ఏటా జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్‌లు రూ. కోట్లతో కొనసాగుతాయి. ఈ ఏడాది ఐపీఎల్ మ్యాచ్‌లు మరింత రసవత్తరంగా మారనుండడంతో బెట్టింగ్‌లు అదే స్థాయిలో కొనసాగే అస్కారం ఉన్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఏదైనా మ్యాచ్‌లు గెలుపోటములపై పందేలు కాయడం సహజం. అయితే ఐపీఎల్ టీ–20 మ్యాచుల్లో జట్టు గెలుపు, ఓటమితోపాటు ఒక ఓవర్‌లో వచ్చే పరుగులు, పడే వికెట్లు, సిక్స్‌లు, ఫోర్లపై బెట్టింగ్‌లు కాస్తుండడం గమనార్హం. ఓవర్‌లోని ఆ బాల్ సిక్స్ వెళుతుందా, వికెట్ పడుతుందా అనే దానిపైనా పందేలు కాస్తారు. జిల్లాలోని కోవెలకుంట్ల, నంద్యాల, బనగానపల్లె, నందికొట్కూరు, ఆళ్లగడ్డ ప్రాంతాల్లో కొన్నేళ్ల నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లలో పెద్ద ఎత్తున బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని వ్యక్తులతోపాటు వైఎస్సార్ కడప, అనంతపురం, తదితర జిల్లాల్లో తమకు పరిచయం ఉన్న బెట్టింగ్ రాయుళ్లతో పందేలు కాస్తారు. మే 25వ తేదీ ఫైనల్ మ్యాచ్ వరకు ప్రతి రోజు కోట్లల్లో బెట్టింగ్ కొనసాగే అస్కారం ఉంది. క్రికెట్ బెట్టింగ్‌లలో డబ్బులు సంపాదించుకుంటారా, పోగొట్టుకుంటారా అనేది వారి అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. ఈ ఏడాది బెట్టింగ్‌లను అరికట్టేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


బేతంచెర్లలో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ


ప్యాపిలి: ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

బేతంచెర్ల: ఆటో డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సీఐ డి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ణీత వేగంతోనే ఆటోలను నడపాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్యాపిలి: వాహన చోదకులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్యాపిలి, రాచర్ల ఎస్‌ఐలు మధుసూదన్, లక్ష్మణరావు అన్నారు. శనివారం ప్యాపిలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆటో డ్రైవర్లు, రాచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపరాదన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపితే వారి సంరక్షకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫారంపాండ్‌లను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథంలో రైతులు ఫారం పాండ్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉడుములపాడు గ్రామంలో తవ్విన ఫారంపాండ్‌ను కూలీలు, అధికారులతో కలిసి ప్రారంభించారు. నీటి ఎద్దడి నివారణ కోసం వర్షం నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ రాధమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ షుకూర్ పాల్గొన్నారు.

సారా జోలికి వెళ్లొద్దు


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

అవుకు: నాటుసారాతో జీవితాలు నాశనం అవుతాయని.. సారా జోలికి వెళ్లద్దని ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్‌ఐ కమలాకర్ సూచించారు. శనివారం అవుకు, కొలిమిగుండ్ల మండలాల పరిధిలోని సుంకేసుల, చింతలాయపల్లె గ్రామాల్లో నవోదయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాటుసారా వల్ల మీ జీవితాలతో పాటు పిల్లల భవిష్యత్ కూడా నాశనం అవుతుందన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్ కోసం సారాకు దూరంగా ఉండాలని సూచించారు. కొలిమిగుండ్ల గ్రామానికి చెందిన ఎరుకలి ఆది, ఎరుకలి రమణలపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అకాల వర్షం.. ఎండ నుంచి ఉపశమనం


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం



కోవెలకుంట్ల: వేసవికాలం కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగతో ప్రజలు అల్లాడిపోయారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో ఏకధాటిగా అరగంటకు పైగా వర్షం పడింది. వాతావరణం చల్లబడి ఎండ తీవ్రత నుంచి జనం ఉపశమనం పొందారు. అయితే జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న కోత, నూర్పిడి, మిరప చివరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అకాల వర్షంతో మొక్కజొన్న దిగుబడులు తడిచిపోకుండా రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఉన్నట్లుండి వర్షం పడడంతో కొన్నిచోట్ల దిగుబడులకు పట్టలు కప్పుకునే అవకాశం లేకపోవడంతో తడిచిపోయాయి. వర్షం, గాలులతో పలు ప్రాంతాల్లో వరి నేలివాలింది. అకాల వర్షం ఎండ నుంచి ఉపశమనం కలిగించినా వరి, మొక్కజొన్న రైతులకు నష్టం మిగిల్చింది.

డోన్‌లో మోస్తరు వర్షం

డోన్ టౌన్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిన జనం వర్షానికి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఇలాగే రెండు మూడు రోజులు వర్షం కురిస్తే బాగుంటుందని రైతులు వాపోయారు.

బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఎన్నిక ఏకగ్రీవం


రవిమోహన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్/డోన్ రూరల్: డోన్ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా కృష్ణగిరి మండలం బి.బొంతిరాళ్ల సర్పంచ్, న్యాయవాది రవిమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డోన్ బార్ అసోసియేషన్ నూతన కమిటీకి నామినేషన్ల పర్వం శుక్రవారం ముగిసింది. సహాయ కార్యదర్శి పదవికి రవిమోహన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన స్థానాలకు ఈ నెల 25వ తేదీ ఉపసంహరణ గడువు, 28న ఎన్నికలు జరగనున్నాయి. కాగా సహాయ కార్యదర్శిగా ఎన్నికైన రవిమోహన్‌ను పలువురు న్యాయవాదులు, సీపీఐ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు రాగుల రాముడు, శేషశయనరావు, మద్దయ్య, రంగారెడ్డి, మద్దిలేటి, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, పట్టణ కార్యదర్శి మోటా రాముడు, కౌన్సిలర్ సుంకయ్య, నాయకులు పులిశేఖర్, రామచంద్రుడు ఉన్నారు.

సాగునీరు విడుదల చేయాలని వినతి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు చేతికందే తరుణంలో సాగునీరు అందక ఎండిపోతున్నాయని రైతులు శనివారం ఎస్సార్బీసీ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన రైతులు రాజు, తలారి పుల్లయ్య, మధు, మద్దిలేటి, వెంకటసుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి కోవెలకుంట్లలోని ఎస్సార్బీసీ కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు 500 ఎకరాల్లో వరి, మిరప, కొర్ర, నువ్వులు, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశామని, మరో నెలల్లో దిగుబడులు చేతికందుతాయని, ఈ పరిస్థితుల్లో పైర్లకు ఎస్సార్బీసీ ద్వారా సాగునీరు అందడం లేదని ఆ శాఖ ఈఈ సుబ్బరాయుడు, డీఈ ప్రసాదరెడ్డి వద్ద వాపోయారు. మరో నెల పాటు కాల్వకు నీటిని విడుదల చేస్తే దిగుబడులు వస్తాయని తెలిపారు.

ఈఈ మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ వద్ద కాల్వకు నీటిని విడుదల చేసే క్రమంలో గేటు పడిపోయి సమస్య తలెత్తిందన్నారు. సమస్యను పరిష్కరించి నీటిని వదులుతామని హామీ ఇచ్చారు.

చిన్నకొప్పెర్లలో చోరీ


చోరీ ఘటనపై విచారణ జరుపుతున్న ఎస్‌ఐ భూపాలుడు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్లలో శనివారం చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి గడపపైన పెట్టి మిరప కోత పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం తెరిచి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ. 1.50 లక్షల నగదు, అర తులం జుమికీలు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన దస్తగిరి ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో బీరువా తెరిచి చూడగా చోరీ జరిగిందని గుర్తించాడు. కాగా బీరువాలోనే మరో చోట ఉంచిన కొంత మొత్తం నగదు, బంగారు ఆభరణాలు దుండగులు గమనించకపోవడంతో సేఫ్‌గా ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా ఎస్‌ఐ భూపాలుడు వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు.

ప్యాపిలి బీసీ కాలనీలో..

ప్యాపిలి: పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో శనివారం సాయంత్రం దొంగతనం జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న వడ్డే నరసింహులు కొద్ది రోజుల క్రితం కుటుంబంతో కలిసి గుంటూరుకు వలస వెళ్లాడు. ఇంటి తాళాన్ని పగులగొట్టిన దుండగులు బీరువాలో ఉంచిన బంగారు నగలతో పాటు, నగదును చోరీ చేసినట్లు సమాచారం. అయితే దొంగతనానికి సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈనెల 14వ తేదీ పట్టపగలే పెట్రోల్ బంకు వద్ద జరిగిన దొంగతనాన్ని మరువక ముందే మరో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

‘తెలుగు’ క్యాలెండర్ల ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న డోన్ డిప్యూటీ డీఈఓ

కోవెలకుంట్ల: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక కోవెలకుంట్ల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయంలో డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, డాక్టర్ రామిరెడ్డి క్యాలెండర్లను ఆవిష్కరించారు. ప్రబోధా సేవా సమితి నాయకులు జనార్దన్, రామసుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, మధుసూదన్, సుధాకర్, వెంకటరమణ, సుబ్బారావు పాల్గొన్నారు.